ప్రజాశక్తి
బుధవారం 22 మే 2024
5
శ్రీకాకుళం



ఏజెంట్లను నియమించుకోవాలి

పలాస : జూన్ నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పోటీ చేసిన అభ్యర్థులు తమ ఏజెంట్లను నియమించుకోవాలని పలాస ఆర్‌డిఒ, రిటర్నింగ్ అధికారి భరత్ నాయక్ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయా అభ్యర్థులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఏజెంట్ల నియామకం, నిర్వహించనున్న విధులపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులు వేసిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లను పలాస స్ట్రాంగ్‌రూమ్ నుంచి ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌కు వచ్చే నెల మూడో తేదీన తరలిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో తహశీల్దార్ ఎస్.ఎస్.వి నాయుడు, అభ్యర్థుల ప్రతినిధులు పాల్గొన్నారు.

వేట నిషేధ సాయమేదీ..?

- **సర్వే పూర్తయినా డబ్బులు అందని పరిస్థితి**
- **బోటు యజమాని సూచించిన పేర్లతో జాబితా**
- **లోపభూయిష్టంగా క్షేత్రస్థాయి సర్వే**
- **పరిహారం కోసం మత్స్యకారుల ఎదురుచూపులు**

సముద్రంలో చేపల వేటపై ప్రస్తుతం నిషేధం కొనసాగుతుండడంతో, మత్స్యకారులు ఇళ్లకే పరిమితమయ్యారు. వేట లేకపోవడంతో పూట గడవడమూ కష్టంగా మారింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం వారికి నిషేధం విధించిన కాలానికి ఏటా ఒక్కో మత్స్యకారునికి రూ.పది వేలు చొప్పన అందిస్తోంది. ఈ సొమ్మును ప్రతి ఏడాది మే మూడో వారంలో అందించేది. ఈ ఏడాది మాత్రం ఇప్పటివరకు వారికి డబ్బులు రాలేదు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో, ఈ ప్రక్రియలో కొంత జాప్యం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. సర్వే ఆలస్యంగా జరగడం, జాబితాల రూపకల్పనలో జాప్యం వంటి కారణాలతో ఖాతాలో డబ్బులు పడలేదని సమాచారం. దీంతో పరిహారం సొమ్ము ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



జిల్లాలోని 11 మండలాల్లో 104 మత్స్యకార గ్రామాలున్నాయి. చేపల వేట ప్రధాన వృత్తిగా సుమారు 25 వేల కుటుంబాలు బతుకుతున్నాయి. గతేడాది 14,043 మందిని అర్హులుగా గుర్తించి వారికి పరిహారం అందించారు. వేట నిషేధిత కాలపు పరిహారాన్ని ప్రభుత్వం కొందరికే పరిమితం చేస్తోంది. పడవలో గరిష్టంగా పది మంది వరకూ చేపల వేటకు వెళ్తారు. మోటరైజ్డ్ బోట్లపై వేట సాగించిన వారిలో ఆరుగురికి, సంప్రదాయ తెప్పలపై వేట చేస్తున్న వారిలో ముగ్గురికి మాత్రమే సాయాన్ని అందిస్తోంది. దీంతో మిగిలిన మత్స్యకార కుటుంబాలు సాయం పొందలేకపోతున్నాయి. కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు వేటకు వెళు తున్నా, అందులో ఒక్కరికే డబ్బులు అందిస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన సాయం డబ్బులనే అందరూ కలిసి పంచుకుంటున్న పరిస్థితి ఉంది.

బోటు యజమాని దయాదాక్షిణ్యాలపైనే...

పరిహారం కోసం నిర్వహించిన సర్వే సమగ్రంగా లేదని తెలుస్తోంది. ప్రతి ఏడాది బోటు దగ్గర వెళ్లి యజమాని, వేటకు వెళ్లే మత్స్యకారుల వివరాలను నమోదు చేసేవారు. ప్రస్తుతం గ్రామాల్లోని బోటు యజమానులను కలిసి, వారు చెప్తున్న పేర్లనే పరిగణనలోకి తీసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో కొన్నిచోట్ల బోటు యజమాని తనకు ఇష్టమొచ్చిన పేర్లను సూచిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొర్రీలతో కోతలు

వైఎస్సార్ మత్స్యకార భరోసా చెల్లింపులో అర్హులకు పలు కారణాలతో కొర్రీలు పెడుతున్నారని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. పరిహారం పొందేందుకు 18 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు ఉండాలని సూచించింది. మత్స్యకారులకు 50 ఏళ్లకే పింఛన్ అందిస్తున్నారు. పింఛన్ సొమ్ము తీసుకుంటుడడంతో, వారిని మత్స్యకార భరోసాకు అనర్హులుగా పక్కన పెడుతోంది. కుటుంబంలో ఒక్కరికి మాత్రమే సాయం అందిస్తామని పేర్కొంది.

పల్లం భూమి మూడు ఎకరాలు గానీ మెట్టు పది ఎకరాలకు మించి గానీ ఉండకూడదని నిబంధన పెట్టింది. నాలుగు చక్రాల వాహనాలు కలిగి ఉన్న వారిని అనర్హులుగా పేర్కొంది. కుటుంబ విద్యుత్ వినియోగం 300 యూనిట్లకు మించకూడదని సూచించింది. కుటుంబంలో ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లలో పనిచేసే ఉద్యోగులు ఉంటే వారిని అనర్హులుగా స్పష్టం చేసింది. కుటుంబంలో ఎవరైనా ఆదాయపు పన్ను చెల్లిస్తుంటే వారికీ పథకం వర్తింపజేయబోమని తెలిపింది.

గతేడాది పరిహారం నేటికీ అందని వైనం

జిల్లాలో గతేడాది 14,043 మందిని అర్హులుగా గుర్తించారు. వారిలో సుమారు 800 మంది మత్స్యకారులకు నేటికీ వారి ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు. బ్యాంకు ఖాతాలు మనుగడలో లేకపోవడం, ఇకెవైసి వంటి సాంకేతిక సమస్యలతో డబ్బులు ఆగిపోయాయి. తొలుత 1100 మంది మత్స్యకారుల వరకు డబ్బులు రాలేదని, సాంకేతిక సమస్యలు పరిష్కరించడంతో 300 మందికి డబ్బులు జమ అయ్యాయని చెప్పారు. ఆగిపోయిన పరిహారం కోసం ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నామని మత్స్యశాఖ ఉప సంచాలకులు పి.వి శ్రీనివాసరావు తెలిపారు.

పరిహారం అందక ఆర్థిక ఇబ్బందులు

చేపల వేట లేక, వేరే పని చేయలేక మత్స్యకారులు ఇళ్ల వద్దనే గడుపుతున్నారు. చేతిలో డబ్బుల్లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి ఖర్చుల కోసం తెలిసిన వారి దగ్గర అప్పులు చేస్తూ రోజులు గడుపుతున్నారు. చేపల వేట లేకపోవడంతో గుజరాత్, చెన్నై, ముంబయి, కేరళ తదితర ప్రాంతాలకు వలస వెళ్లిన మత్స్యకారులు తిరిగి సొంత గ్రామాలకే చేరుకోవడంతో కుటుంబ పోషణ మరింత భారంగా మారింది. ప్రభుత్వం వెంటనే పరిహారం డబ్బులు అందించేలా చూడాలని వారంతా కోరుతున్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవీన్

కౌంటింగ్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి

- **మొత్తం ప్రక్రియను వీడియోగ్రఫీ చేయాలి**
- **జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్**

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జూన్ నాలుగో తేదీన నిర్వహించే కౌంటింగ్ కోసం ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అధికారులను ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నిర్వహణ ముందస్తు ఏర్పాట్లపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు లోబడి ప్రక్రియ మొత్తాన్ని వీడియోగ్రఫీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఒక్కొక్క హాల్‌లో అబ్జర్వర్‌కి ఒక సహాయకులు ఉండాలన్నారు. లేబర్ అరేంజ్‌మెంట్‌కు సంబంధించి డ్వామా పీడీ తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. శిక్షణా తరగతులకు సంబంధించి మొదటి విడత ర్యాండమైజేషన్ ఈనెల 25వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. తరగతుల నిర్వహణ కోసం ఎన్నికల కమిషన్ నిర్దేశించిన సూచనలను అనుసరించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై పూర్తి శిక్షణ అందజేయాలని, 23వ తేదీన ఆర్‌ఒలకు, ఎఆర్‌ఒలకు శిక్షణా తరగతులు జరుగనున్నాయన్నారు. లెక్కింపు ప్రక్రియకు సంబంధించి మూడంచెల శిక్షణా తరగతులు నిర్వహించాలన్నారు. మీడియా సెంటర్ ఏర్పాట్లపై జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారితో సమీక్షించి, చేపట్టాల్సిన పనులపై సూచనలు చేశారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం తదితర ఏర్పాట్లపై డిప్యూటీ సిఇఒతో సమీక్షించి సమీక్షించారు.

కౌంటింగ్ హాల్ ఏర్పాట్లపై ఆరా తీసి కౌంటింగ్ హాల్ ఏర్పాట్లపై ఎన్నికల సంఘం సూచనలు తప్పక పాటించాలని సూచించారు. సిసిటివి ఏర్పాట్లు, వీడియోగ్రాఫర్స్ ఏర్పాట్లపై సూచనలు అందజేశారు. అనంతరం సెక్యూరిటీ ఏర్పాట్లకు సంబంధించి మొబైల్ కలెక్షన్ కౌంటర్, మెటల్ డిటెక్టర్, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ఏర్పాటుపై పోలీసులకు సూచనలు అందజేశారు. నిరంతరం విద్యుత్ అందుబాటులో ఉండేలా చూడాలని, ఆటో ఛార్జర్స్, లైటింగ్ ఏర్పాట్లపై ట్రాన్స్‌కో ఎస్‌ఇకి పలు సూచనలు జారీ చేశారు. కౌంటింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలు ఏర్పాట్లపై సుడా విసికి, కౌంటింగ్ కేంద్రంలో కావాల్సిన స్టేషనరీ ఏర్పాట్లపై జెడ్‌పి సిఇఒకి తగు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, సుడా విసి ఓబులేసు, సమగ్ర శిక్ష అభియాన్ పిఒ జయప్రకాశ్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, ఎన్‌ఐసి సిరాజ్, కిరణ్, డిసిఒ బాలాజీ నాయక్, ట్రాన్స్‌కో ఎస్‌ఇ ఎన్.కృష్ణమూర్తి, డిటిసి చంద్రశేఖర్ రెడ్డి, డ్వామా పీడీ చిట్టి రాజు, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ ఆర్.వెంకట్రామన్, ఆర్అండ్‌బి ఎస్‌ఇ జాన్ సుధాకర్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సుధ, ఫైర్ ఆఫీసర్ మోహనరావు, ఎల్‌డిఎం సూర్యకిరణ్, ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ, సివిల్ సప్లై డిఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 24 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు తెలిపారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా నిర్వహించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మార్చిలో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించామని, అదే స్ఫూర్తితో సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు సహకరించాలన్నారు. సప్లిమెంటరీ పరీక్షలకు 51 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు జనరల్, ఒకేషనల్ కలిపి 23,668 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు వివరించారు. ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చిలో ఉదయం వేళ మాత్రమే పరీక్షలు నిర్వహించామని, ఇప్పుడు రెండు పూటలూ నిర్వహిస్తున్న నేపథ్యంలో వేసవి దృష్ట్యా విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, విద్యుత్, ఇతర సదుపాయాలు ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసు బందోబస్తుతో పాటు ప్రతి పరీక్షా కేంద్రంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. వైద్యారోగ్యశాఖ పారా మెడికల్ సిబ్బందితో పాటు అవసరమైన మందులు, ఒఆర్ఎస్ ప్యాకెట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు సకాలంలో విద్యార్థులు చేరుకునేలా ఆర్‌టిసి బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ కొనసాగేలా ఎపిఇపిడిసిఎల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జవాబు పత్రాలు సకాలంలో స్వీకరించేలా తపాలా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ప్రాంతీయ తనిఖీ అధికారి దుర్గారావు, జిల్లా ఒకేషనల్ విద్యాశాఖాధికారి, పరీక్షల ప్రత్యేక అధికారి కె.ప్రకాశరావు, డిఇసి బి.శ్యామసుందర్, కె.తవిటినాయుడు, జి.సింహాచలం, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె చెన్నకేశవరావు, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

భార్యే కడతేర్చింది..!

- **వివాహేతర సంబంధమే కారణం**
- **సురేష్ హత్య కేసు కొలిక్కి**
- **మూడు రోజుల్లోనే ఛేదించిన పోలీసులు**

ప్రజాశక్తి - శ్రీకాకుళం

నగరంలోని గూనపాలెంలో పారిశుధ్య కార్మికుడు సురేష్ హత్య కేసును పోలీసులు మూడు రోజుల్లోనే ఛేదించారు. భార్య వివాహేతర సంబంధమే ఈ హత్యకు కారణమని నిర్ధారించారు. అక్రమ సంబంధానికి అడ్డం కాకూడదని ప్రియుడితో భర్తను అంతమొందించింది. వివరాల్లోకి వెళ్తే... ఈనెల 17న గూనపాలెంలో సురేష్ తన ఇంట్లో మేడపై నిద్రిస్తున్న సమయంలో హత్యకు గురయ్యాడు. దీనిపై కేసు నమోదు చేసిన ఒకటో పట్టణ పోలీసులు అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేపట్టారు. మృతుని భార్య తిరుమల వ్యవహారశైలి అనుమానాస్పదంగా ఉండడం, ఆమె నుంచి ఆశించిన స్థాయిలో సహకారం లభించకపోవడంతో ఆమెపై అనుమానాలు బలపడ్డాయి. ఈ కోణంలో పోలీసులు విచారణ చేపట్టగా వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.

సురేష్ హత్యకు అతడి భార్య తిరుమలే సూత్రధారి అని పోలీసుల విచారణలో తేలింది. ఇందుకు తన ప్రియుడిని తిరుమల వాడుకున్నారు. సురేష్‌ను అంతమొందిస్తే తమ వివాహేతర సంబంధానికి అడ్డు ఉండదని భావించారు. పథకం ప్రకారం ఈనెల 16న రాత్రి సురేష్ తీసుకున్న ఆహారంలో నిద్రమాత్రలు కలిపి ఇవ్వడంతో నిద్ర మత్తులోకి జారుకున్నాడు. అర్ధరాత్రి 12 తర్వాత గూనపాలెం ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ప్రియుడికి తిరుమల సమాచారం అందజేసింది. మరో మిత్రుని సహకారంతో తిరుమల ప్రియుడు, ఆమె ఇంటికే వెళ్లి నిద్రిస్తున్న సురేష్ గొంతును కత్తితో కోసేశారు. అతడు మృతి చెందాడని నిర్ధారించుకున్న తర్వాత నిందితులు ఇద్దరూ పరారయ్యారు.

సురేష్ భార్య తిరుమల గతంలో నగరంలోని ఒక హోటల్‌లో పనిచేసిన సమయంలో అక్కడ పనిచేసే ఒడిశాకు చెందిన వ్యక్తితో పరిచయం ఏర్పడింది. క్రమంగా అది వివాహేతర సంబంధానికి దారితీసింది. సురేష్ తమ సంబంధానికి అడ్డుగా మారడంతో తిరుమల అతడిని అంతమొందించాలని పథక రచన చేసింది. ఈ విషయాన్ని ప్రియుడికి చెప్పగా, అతడు ఆమదాలవలస రోడ్డులో ఓ దాబాలో పనిచేసే తన మిత్రుడి సహకారాన్ని తీసుకున్నాడు. తిరువుల ప్రియుడు, అతని మిత్రుడు కలిసి నిద్రిస్తున్న సురేష్‌ను తమ వెంట తెచ్చుకున్న కత్తితో హత్య చేశారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.




మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జెడి శ్రీధర్

ఆర్‌బికెల ద్వారా విత్తనాలు, ఎరువులు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

రైతుభరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను విక్రయించనున్నట్లు వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్ తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖరీఫ్ కార్యాచరణపై స్థానిక రైతుభరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకులు, రైతులతో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు అవసరమైన అన్ని సేవలు రైతుభరోసా కేంద్రాల ద్వారా అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

ఖరీఫ్ పంట కాలానికి కావాల్సిన పచ్చిరొట్ట, వరి విత్తనాలు జూన్ మొదటి వారంలో రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు స్థానిక రైతుభరోసా కేంద్రాల్లో ముందుగానే నిల్వ చేసుకోవాలని వ్యవసాయ సహాయకులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహ సంచాలకులు భవానీ శంకర్, జిల్లా విత్తనాభివృద్ధి సంస్థ మేనేజర్ పి.బాలకృష్ణ, మండల వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ రాఘవేంద్రరావు

వాణిజ్యకు ధీటుగా సహకార బ్యాంకులు


ప్రజాశక్తి - పలాస

వాణిజ్య బ్యాంకులకు ధీటుగా సహకార బ్యాంకులు సేవలందిస్తున్నాయని ది విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. కాశీబుగ్గలోని ఒక కళ్యాణ మండపంలో బ్యాంకు ఇన్‌ఛార్జి డైరెక్టర్ కె.ప్రసాదరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సభ్యుల మహాసభలో ఆయన మాట్లాడారు. దేశంలో సహకార బ్యాంకులకు ది విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు ఆదర్శమన్నారు. బ్యాంకు సభ్యులకు ఏ ఇతర సహకార బ్యాంకు అమలు చేయని పథకాలను చేస్తున్నామని చెప్పారు. సేవింగ్ ఖాతాల్లోని నిల్వలపై రోజువారీ లెక్కింపు ప్రాతిపదికన ఐదు శాతం వడ్డీ చెల్లిస్తున్న బ్యాంకు కేవలం విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు మాత్రమేనన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుకు 97,122 మంది సభ్యులు ఉండగా 2023-24 ఏడాదికి అది 1,04,865 మందికి చేరిందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.83 కోట్ల లాభం వచ్చిందని, ఈ ఏడాది డెవిడెండ్లపై పది శాతం లాభాలను సభ్యుల ఖాతాలకు జమ చేశామన్నారు. దేశంలోని 1514 సహకార బ్యాంకుల్లో తొలి పది స్థానాల్లో నాలుగో స్థానంలో విశాఖ బ్యాంకు నిలిచిందని చెప్పారు. డిపాజిట్ల సేకరణలో 16వ స్థానం, రుణాల మంజూరులో 15వ స్థానం, మిగులులో పదో స్థానంలో ఉందన్నారు. పలాస బ్రాంచ్ ఏర్పాటు చేసి 11 సంవత్సరాలు పూర్తయిందని తెలిపారు. బ్రాంచ్ సిబ్బంది, సంప్రదింపుల కమిటీ సభ్యులు, డైరెక్టర్ సహకారంతో డిపాజిట్ల సేకరణ, రుణాల మంజూరుకు కృషి చేస్తున్నామన్నారు. తనఖా రుణాల వాయిదాలను సక్రమంగా చెల్లిస్తే చెల్లించిన వడ్డీలో నాలుగు శాతం నగదు ప్రోత్సాహకంగా ఇస్తున్నామన్నారు. రూ.4,144 కోట్లు డిపాజిట్లు సేకరించగా, రూ.మూడు వేల కోట్లకు పైగా రుణాలు అందజేశామని, మొత్తం రూ.ఏడు వేల కోట్లతో లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ ఎం.సత్యనారాయణ, పలాస బ్రాంచ్ మేనేజర్ పి.సిరి, రాజాం బ్రాంచ్ మేనేజర్ జి.ఎల్.వి ప్రకాశరావుతో పాటు బ్యాంకు సిబ్బంది, సమన్వయ కమిటీ సభ్యులు, షేర్ హోల్డర్లు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్నికల ఉపాధి

- **45 రోజులకు పైగా నాయకుల వెంట ప్రచారం**
- **మళ్లీ ఎవరి పనులకు వారు...**

నేతల వెంట నడిచే కార్యకర్తల సంఖ్యను బట్టి నాయకుడి బలాన్ని అంచనా వేసే సంస్కృతి పెరిగింది. దీంతో ఆ పది మంది కోసం నాయకులు తహతహలాడుతున్నారు. ఎన్నికల సమయంలో చేపట్టే ప్రదర్శనలకు జనాల సమీకరణ ప్రహసనంగా మారింది. దీంతో నేతలను అనుసరించే చోటా నాయకులకు బాగా డిమాండ్ పెరిగింది. ఎన్నికలు రావడంతో వారికి ఉపాధి అవకాశాలు తెచ్చిపెట్టాయి. పార్టీ జెండా పట్టుకుని నాయకుని వెంట తిరిగితే రోజుకు రూ.500 వరకూ గిట్టుబాటు అయింది. పట్టణాల్లో ఈ తంతు నిరంతర ప్రకియగా కొనసాగింది. పురుషుల కంటే మహిళలను ఎక్కువ సంఖ్యలో తరలించి తమ వెంట తిప్పడానికి నాయకులు మక్కువ చూపించారు.



ప్రజాశక్తి - పలాస

పురుషుల కంటే మహిళలకు ఇచ్చే కూలి రెండు నుంచి మూడు గంటలకు రూ.200 నుంచి రూ.300 ఉండగా, పురుషులకు అదే కూలి ఇస్తూ మందు బాటిల్ కూడా ఇవ్వాల్సి వచ్చింది. దీంతో మహిళలను సభలకు, ర్యాలీలకు ఎక్కువగా తరలించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో నాయకుని పిలుపుతో కదిలి వచ్చే జనాలను తరలించే వారి పంట పండింది. ఎండలో అలసిపోతే మజ్జిగ ప్యాకెట్లు, శీతల పానీయాలు, మధ్యాహ్నం భోజనంతో 45 రోజులకు పైగా ఎన్నికల ఉపాధి లభించింది. ఎన్నికల జాతర మొదలైన నాటి నుంచి పట్టణ ప్రాంతాల్లో ఎన్నికల కూలీలకు డిమాండ్ బాగా పెరిగింది. సభలకు, ర్యాలీకి ఎంతమంది అవసరం, ఎన్ని గంటల పాటు ఉండాలన్న ప్రాతిపదికన చెల్లింపులు చేశారు. నాయకులు అవసరాన్ని బట్టి ఉదయం ఏడు గంటలకే ప్రచారంలో, ర్యాలీ, సభలో పాల్గొనే వారి పేర్లను రాసుకోవడం, ప్రక్రియ ముగిసిన తర్వాత నగదు చెల్లింపులు చేయడం పరిపాటిగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో పలువురు సభలు, ర్యాలీలకు వెళ్లే ఎన్నికల ఉపాధి కూలీలుగా మారిపోయారు. తమకు మేలు చేస్తారన్న నేతల వెంట నడుస్తూనే, వారి ఇచ్చే నోటును పుచ్చుకునే సంస్కృతి ఈ ఎన్నికల్లోనూ కొనసాగింది. ఇప్పుడు ఎన్నికల క్రతువు ముగియడంతో మళ్లీ ఎవరి పనులకు వారు వెళ్తున్నారు.


మాట్లాడుతున్న భారతీలక్ష్మి

జీవన ఎరువులతో అధిక దిగుబడి

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

రైతులు జీవన ఎరువులు ఉపయోగంచడం వల్ల అధిక దిగుబడిన పొందవచ్చని అసోసియేటెడ్ డాక్టర్ భారతీలక్ష్మి అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం నైర పంచాయతీ వెంకటాపురంలో నైర ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయం కళాశాల ఆఖరి సంవత్సరం విద్యార్థులు ఏర్పాటు చేసిన జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరాన్ని మంగళవారం రెండో రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆత్మ పీడీ డాక్టర్ ఎ.రామచంద్రరావు మాట్లాడుతూ నెలాఖరుకు నైరుతి రుతుపవనాలు మన రాష్ట్రానికి ప్రవేశిస్తున్నాయని, దీన్ని దృష్టిలో పెట్టుకొని రైతాంగం ఇప్పటి నుంచే ఖరీఫ్ సాగుకు సిద్ధం కావాలని అన్నారు. జిల్లాకు 38 వేల మెట్రిక్ టన్నులు వరి విత్తనాలు, 22 వేల మెట్రిక్ టన్నుల యూరియా, ఇతర క్రిమిసంహారక మందులు కావాలని ఇండెంట్ ప్రభుత్వానికి పంపించామని తెలిపారు. ప్రస్తుతం 10 వేల మెట్రిక్ టన్నుల వరి విత్తనాలు జిల్లాకు వచ్చాయని, వీటిని విక్రయిస్తున్నామని స్పష్టం చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు ఎరువులు విక్రయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బి.చంద్రమౌళి, వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త అమరజ్యోతి, జ్యోతిబసు, కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న జెఇ అప్పలరెడ్డి

కూలిన వంతెన పరిశీలన

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని మరువాడ పంచాయతీ ఎం.మరువాడ వద్ద వంశధార కాలువపై నిర్మించిన వంతెన ఇటీవల కూలిపోయింది. 'కూలిన వంతెన', 'సాగు నీరు అందేనా' అనే కథనాలను ఈ నెల 20న ప్రజాశక్తిలో ప్రచురితమయ్యాయి. స్పందించిన వంశధార జెఇ జీరి అప్పలరెడ్డి కూలిన వంతెనను, వంశధార కాలువలోని జంగిల్‌ను మంగళవారం పరిశీలించారు. వంతెన నిర్మాణానికి, జంగిల్ తొలగించడానికి అంచనాలు తయారు చేస్తామని అన్నారు. ఎన్నికల కోడ్ వచ్చే నెల 4 వరకు ఉండడం వల్ల అప్పటి వరకు పనులు మంజూరుకు ఆలస్యం అవుతుందని తెలిపారు. ఈయన వెంట మరువాడ వైసిపి ఇన్‌ఛార్జి గంట ఈశ్వరరావు, మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు సూరాడ జోగారావు, మరువాడ సర్పంచ్ ప్రతినిధి సూరాడ దాసురాజు, గంట కుమార్, మేరుగు పాపారావు, సూరాడ నిరాకరి, గంట వల్లభరావు ఉన్నారు.

లోతైన దుక్కులతో భూసారం మెరుగు

ప్రజాశక్తి- బూర్జ

పంట పొలాల్లో వేసవి దుక్కులు వల్ల దిగుబడులకు ఎంతో మేలు జరుగుతుంది. కలుపు యజమాన్య ప్రక్రియను వేసవి నుంచి చేపడితే కలుపు మందులను ఆశ్రయించకుండా రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులపై దృష్టి సారించడానికి వీలుంటుంది. భూమిని లోతైన దుక్కులు దున్నడం వల్ల మిగిలిపోయిన కలుపు మొక్కలను పూర్తిగా నాశనం చేయొచ్చు. సెనగ, మిరప, మినుము, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు పూర్తయిన తర్వాత మిగిలిన కలుపు మొక్కలు తొలకరి వర్షాలకు అధికముగా విత్తనోత్పత్తి చేసుకుంటాయి. వేసవిలో తప్పనిసరిగా లోతైన దుక్కులు దున్నాలి. ఇలాంటి దుక్కుల వల్ల భూమిలో ఉన్న కీటకాలు, గుడ్లు, లార్వాలు చనిపోవడంతో పాటు గడ్డి జాతులు తుంగ గరికను అరికట్టవచ్చు. భూమిలోని పోషకాలు కూడా పెరిగి పంట దిగుబడి బాగా వస్తుంది. లోతు దుక్కులతో చేయడమే కాకుండా వేసవిలో దుక్కు దున్నకుండా సాగుచేస్తే కొయ్యి కుండాపోతుంది. ఏ పంట వేయాలన్నా ముందుగా దుక్కు దున్నాల్సిందే. విత్తేందుకు నాటేందుకు అనుకూలంగా పొలాన్ని చదును చేసుకోవాల్సిందే. దుక్కి దున్నకుండా వదిలేయడం వల్ల భూమి



సత్తువ కోల్పోతుంది. చీడపీడలకు ఆవాసంగా మారుతుంది. భూమి పోషకాల లోపం ఏర్పడి తరువాత పంటకు ఎరువులు బాగా వేయాల్సి ఉంటుంది. అందుకే వేసవిలో రైతులు నూతన దుక్కులపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

భూసార పరీక్షలు తప్పనిసరి

ప్రతి రైతూ వారివారి పొలంలో భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. ఈ భూసార పరీక్షలు వల్ల భూమిలోనే పోషక విలువలు తెలియచేయడంతో పాటు దిగబడులకు అవసరమైన ఎరువులను ఏ మోతాదులో వాడాలో తెలుస్తుంది. తద్వారా పంట సాగు ఖర్చులు కూడా తగ్గుతాయి.

మూడు రకాలుగా...

భూమి దుక్కులను లోతుగా వాలుకు అడ్డంగా దున్నుకోవాలి. వాలుకు అడ్డంగా దున్నుకోవడం వల్ల వాన నీరు భూమిలోకి ఇంకెందుకు అనుకూల పరిస్థితి ఏర్పడుతుంది. భూమి కూడా ఎక్కువ తేమను గ్రహిస్తుంది. నీటి నిలువ సామర్థ్యం పెరుగుతుంది. వేసవి దుక్కులకు ముందు పొలంలో గొర్రెలు, పశువుల మందలు తోలడం వల్ల వాటి విసర్జిక పదార్థాలు సేంద్రీయ ఎరువులుగా మారి భూమిలోకి చేరుతాయి. భూసార వృద్ధికి తోడ్పడతాయి. గత పంటకు సంబంధించి ఆకులు మొదల్లు చెత్తాచెదారం నేలలో తడిసిపోయి కలిసిపోయి సేంద్రీయ ఎరువుగా మారుతాయి. రాబోయే పంటకు కావాల్సిన పోషక పదార్థాలు అందుతాయి.

నాణ్యమైన దిగబడులు

ప్రస్తుత పరిస్థితులు పొలాలను రైతులు సేంద్రీయ ఎరువులు చల్లుకోవాలి. తొలకరింపు ముందే లోతు దుక్కులు దున్నుకొని పొలాలను సాగుకు సిద్ధం చేసుకోవాలి. తద్వారా వ్యవసాయంలో వాతావరం అవరోధాలు భూశాలు కలుపు సమస్యలు సేంద్రీయ పద్ధతులు లాంటి అవరోధాలు దిగుబడిని దెబ్బతీస్తాయి. రైతులు ఎప్పటికప్పుడు సరికొత్త మెలకువలు పాటిస్తే అధిక దిగుబడును పొందవచ్చు.

చెద పురుగు నశిస్తుంది

రైతులు వేసవిలోని లోతైన దుక్కులు దున్నుకోవాలి. పొలానికి అడ్డంగా దున్నడం తో భూసారంలోని చెద పురుగులు నశించిపోతాయి. తగినంత తేమ ఉన్నప్పుడు దుక్కులు లోతుగా దున్నాలి. తర్వాత రైతులు వేప గింజ మిశ్రమాన్ని చేనులో పిచికారీ చేయాలి. క్రిమి కీటకాలు పంటను ఆశించవు. క్రిమిసంహారిక మందులు వాడకుండా పండించడమే మంచిది.

- వి.రాజేశ్వరరావు,
మండల వ్యవసాయశాఖ అధికారి

ఆక్రమణలు తొలగించాలని వినతి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పట్టణంలోని సురంగి రాజా క్రీడా మైదానంలో ఆక్రమణలు జోరందుకుందని స్థానిక జాతీయ క్రీడాకారుడు పాపారావు అన్నారు. ఈ మేరకు డిటి శ్రావణకుమార్, మున్సిపల్ కమిషనర్ రమేష్‌ను మంగళవారం కలిసి వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. అ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఆక్రమణలపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు క్రీడాకారులు, స్థానికులు ఎప్పటికప్పుడు ఫిర్యాదు చేస్తున్నా స్పందించకపోవడంతో రోజు రోజుకీ క్రీడా మైదానం కబ్జా కోరల్లో చిక్కిపోతోందన్నారు. సురంగి రాజా వారసులు ప్రజలకు, విద్యార్థులకు క్రీడా మైదానం ఇచ్చారని, దానిని సంరక్షించుకునే బాధ్యతలను స్థానిక క్రీడాకారులదేనని అన్నారు. తాజాగా సురంగి రాజా


డిటికి వినతిపత్రం అందజేస్తున్న క్రీడాకారులు

కుటుంబ సభ్యుల క్రీడా మైదానంలోని శ్మశాన వాటిక వెళ్లేందుకు ఉపయోగించే స్థలం కూడా కబ్జా కోరల్లో చిక్కుకుందన్నారు. తక్షణమే స్పందించి చర్యలు తీసుకుని క్రీడామైదానం సంరక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు. తప్పుడు పత్రాలతో క్రీడా మైదానం స్థలాన్ని అక్రమించుకున్నారని, రెండు శాఖలు సమగ్రంగా విచారణ చేపట్టి క్రీడాకారులకు న్యాయం చేయాలని కోరారు.

'వైసిపి విజయం ఖాయం'

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో వైసిపి విజయం సాధిస్తుందని ఆ పార్టీ జిల్లా నాయకులు పిన్నింటి జయరాం అన్నారు. పూండిలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ రెండోసారి రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగడం వైసిపి విజయానికి నాంది అన్నారు. జగనన్న ప్రభుత్వంలో లబ్ధిపొందిన ప్రతి ఒక్కరూ ప్రలోభాలకు లొంగకుండా వైసిపికే ఓటు వేశారని అన్నారు. ప్రభుత్వ పథకాలు పొందిన వారు జగన్‌ను గెలిపించుకోడానికి క్యూ లైన్‌లో గంటల కొద్దీ నిలబడి ఓటు వేశారని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో మద్యం విచ్చలవిడిగా పంపిణీ చేసి ఓటర్లను ప్రలోభ పెట్టిన టిడిపి అధికారంలోకి వస్తామని కలలు కంటుందన్నారు. టిడిపి విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రజల నమ్మకం చూరగొనలేదు అన్నారు. పలాసలో డాక్టర్ సీదిరి అప్పలరాజు విజయం తధ్యమన్నారు. ఎంపీగా పేరాడ తిలక్ గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.


వినీత్ మృతదేహం

పాముకాటుతో బాలుడు మృతి

వైద్యుల నిర్లక్ష్యమేనని కుటుంబసభ్యుల ఆరోపణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని చిన్న నారాయణపురానికి చెందిన దాసరి మురళి నిరోష దంపతుల పెద్ద కుమారుడు సాయి వినీత్ (13) మంగళవారం పాముకాటుకు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే... వేసవి సెలవులు కారణంగా రోజూ క్రికెట్ ఆడుతుండేవాడు. ఇందులో భాగంగా మంగళవారం తోటి విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం క్రికెట్ ఆట ఆడుతున్నాడు. బ్యాట్స్‌మెన్ బాలు తుప్పల్లోకి కొట్టాడు. దానిని తీసుకురావడానికి వినీత్ వెళ్లాడు. అదే సమయంలో గుర్తు తెలియని విషసర్పం కాటు వేయడంతో ఒక్కసారిగా కుప్పకూలేడు. వెంటనే తల్లిదండ్రులు టెక్కలి జిల్లా ఆస్పత్రికి హుటాహుటిన తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని చెబుతూ వెంటనే వైద్యులు జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. 108లో తీసుకెళుండగా... వినీత్ పరిస్థితి విషమించింది. మార్గంమధ్యలోని నరసన్నపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు శంకరరావు బాలుడికి వైద్య పరీక్షలు నిర్వహించగా... అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. దీనిపై టెక్కలి జిల్లా ఆస్పత్రి వైద్యాధికారుల తీరుపై మృతుని తల్లిదండ్రులు, బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. సాధారణ వైద్యం కూడా అందించలేదని, అందుకే తమ కుమారుడు మృతి చెందాడని ఆరోపించారు. సంబంధిత ఆస్పత్రి సిబ్బంది చర్యలు తీసుకోవాలని విరుచుకుపడ్డారు. కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


వాహనాలను సీజ్ చేసిన పోలీసులు

వాహనాల సీజ్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని చెవ్వాకులపేట వద్ద ఉన్న వంశధార నదిలో నుంచి కొంత కాలంగా అనధికారంగా ఇసుక ర్యాంపు నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ కె.వెంకటేష్ తన సిబ్బందితో సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ ఇసుక ర్యాంపులో మూడు లారీలను, ప్రొక్లైనర్‌ను పట్టుకుని సీజ్ చేశారు. వాటిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఇబి ఎస్ఐ వి.ఎల్.కె.స్వర్ణలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.


కేక్‌ను కట్ చేస్తున్న అభిమానులు

మంత్రి ధర్మాన జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మండలంలోని పెద్దపాడు వద్ద ఉన్న మంత్రి కార్యాలయంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు జన్మదిన వేడుకలను కార్యకర్తలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకులను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో వైసిపి రూరల్ మండల అధ్యక్షులు చిట్టి జనార్ధనరావు, జెడ్‌పిటిసి ఆర్.దివ్య, ఎంపిపి ప్రతినిధి అంబటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న గంగాభవానీ

ఘనంగా గంగాభవానీ జన్మదినం

ప్రజాశక్తి- పలాస

పలాస మదర్ థెరీసా పాఠశాలలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు సతీమణి, పాఠశాల కరస్పాండెంట్, మాజీ కౌన్సిలర్ టిడిపి మహిళా నాయకులు వజ్జ గంగాభవాని జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో సూర్యతేజ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ దానేటి పద్మజీ, టిడిపి నాయకులు గూన మన్మథ, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రసాదరావు, ఉపాధ్యాయులు సప్ప చిరంజీవి, జోగారావు, సప్పటి బేబీ, యశోద, రేవతి పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

శ్రీకాకుళం రూరల్ : ఈ నెల 22న మండల సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ఉదయం పది గంటలకు ఎంపిపి అంబటి నిర్మల అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విధిగా ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, పూర్తి సమాచారంతో మండలస్థాయి అధికారులు పాల్గొవాలన్నారు.

వెంకన్న చౌదరి పరామర్శ

పలాస : మండలంలోని పెదంచలలో తెలుగుదేశం కార్యకర్త వరశి జనారావు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి మృతుడు కుటుంబాన్ని మంగళవారం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడు కుటుంబానికి పార్టీ, తాము అండగా ఉంటామని, ఎప్పుడూ ఏ అవసరం వచ్చినా సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు తదితరులు ఉన్నారు.


పరామర్శిస్తున్న వెంకన్నచౌదరి

ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలి


దీక్షల్లో పాల్గొన్న బెంతు ఒరియాలు

ప్రజాశక్తి- కవిటి

తమ బిడ్డల భవిష్యత్ కోసం తమకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాల్సిందేనని బెంతు ఒరియాలు స్పష్టం చేశారు. తమ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు మంగళవారానికి 146వ రోజుకి చేరుకుంది. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ గుర్తింపు లేకపోవడంతో విద్యార్థుల ఉన్నత చదువులు, నిరుద్యోగుల ఉపాధి గాల్లోపెట్టిన దీపంలా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తింపు, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడ శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి సెలవుల్లో భాగంగా గ్రంథాలయాధికారి బి.రూపావతి విజ్ఞాన శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులుతో నీతి కథలు, పంచతంత్ర, ఇతిహాస గాథలు చదివించారు. సృజనాత్మకత పెంపొందించే వివిధ రకాల ఆటలను ఆడించారు. తద్వారా మానసిక ఉల్లాసానికి ఆరోగ్యానికి మేలు


నౌపడ : పుస్తకాలను చదువుకుంటున్న విద్యార్థులు


సంతబొమ్మాళి : పత్రికలను చదువుతున్న విద్యార్థులు

జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెల్పర్ ప్రసాద్, పాఠకులు పాల్గొన్నారు.


సంతబొమ్మాళి : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సంతబొమ్మాళి శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయాధికారి కె.రామకృష్ణ విద్యార్థులతో పత్రికల్లో వచ్చిన కథనాలు చడవడంపై అవగాహన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో 18 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అంబరాన్నంటిన సంబరం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని నెలవంకలో అసిరిపోలమ్మ నవరాత్రి సంబర మహోత్సవం అంబరాన్నంటింది. వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి బాణసంచా వెలుగులతో నెలవంక పరిసర ప్రాంతాలు వెలుగులు విరజిమ్మాయి. ఈ వెలుగులు చూసేందుకు వచ్చిన పరిసర ప్రాంతాల ప్రజల మోములు కాంతులీనాయి.


నెలవంకలో బాణసంచా వెలుగులు

అల్లర్లు సృష్టిస్తే చర్యలు

టెక్కలి రూరల్ : గ్రామాల్లో ఘర్షణలు, అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని సిఐ పి.పైడయ్య, తహశీల్దార్ మురళీకృష్ణ హెచ్చరించారు. మండలంలోని రావివలస, భగవాన్‌పురం, బూర్గాం గ్రామాల్లో మంగళవారం రాత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ ముందు, తరువాత అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఐకమత్యంగా ఉండాలన్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారులు

వెంకటేశ్వరస్వామి సందర్శన

కోటబొమ్మాళి: నరసన్నపేటలో వెంకటేశ్వస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు టిడిపి బిసి సాధికారిక కళింగ కోమటి రాష్ట్ర కన్వీనర్ బోయిన గోవిందరాజులు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ పొట్నూరు చిన వీరభద్రస్వామి గోవిందరాజులకు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి వారి శేషవస్త్రంతో సన్మానించారు. ఆయనతోపాటు కళింగ కోమటి పెద్దలు జామి వెంకటరావు, ఉన్న వెంకటేశ్వరరావు (పెద్దబాబు) ఉన్నారు.

ఘనంగా అమ్మవారి ఉత్సవాలు

పాతపట్నం: మండలంలోని తెంబూరులో ఉన్న నీలమణి దుర్గ అమ్మవారి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సర్పంచ్ బెనియ వెంకటరమణ అధ్యక్షతన ఆలయ ప్రధాన అర్చకులు బెనియా వాసుదేవరావు ఆధ్వర్యాన అమ్మవారి ఘటాలతో ఊరేగించారు. మేళతాళాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఐదేళ్లకొకసారి ఈ పండగను నిర్వహిస్తామని సర్పంచ్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఆమదాలవలస : పట్టణంలోని బి.ఆర్.నగర్ ప్రాంతంలోని పొలాల్లో అనుమానాస్పద స్థితిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మతి చెందారు. దీనిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి గుర్తు తెలియని వ్యకిగా నిర్ధారించారు. స్థానికుల నుంచి సమాచారం సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఉదయం తొమ్మిది గంటలకే బోసిపోయిన కోటబొమ్మాళి రహదారి

ఉక్కపోతతో విలవిల

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

వాతావరణం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. భానుడి భగభగలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణం చల్లబడుతుందని అశించిన ప్రజలు ఎండవేడిమి, ఉక్కపోతతో అతలాకుతలమవుతున్నారు. వారం రోజులుగా ఎండతోపాటు వేడి వడగాల్పులతో జనం హడలిపోయారు. మంగళవారం కోటబొమ్మాళి మండలంలో 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. పనులు చేసేందుకు వెళ్లిన రైతులు, వ్యవసాయ, ఉపాధి హామీ కూలీలు ఎండ తీవ్రతకు తల్లడిల్లిపోయారు. ఉదయం ఏడు గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని ప్రదర్శించాడు. వ్యవసాయ కూలీలు పొలాల్లోంచి ఇళ్లకు వచ్చేందుకు అవస్థలకు గురయ్యారు. తల, ముఖానికి తువ్వాళ్లు చుట్టికుని ఆపసోపాలు పడుతూ ఇళ్లకు చేరుకున్నారు. ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు ఇక్కట్లకు గురవుతున్నారు. దీనికి తోడు గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ కోతలు సంబంధిత అధికారులు విధించటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అయితే ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలు, ఉక్కబోతకు రోడ్లు ఖాళీగా దర్శనమిచ్చాయి.

అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఫలితాలు ముందు... ఆ తర్వాత గ్రామాల్లో, వార్డుల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్‌దొర సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పోలీసులతో, రెవెన్యూ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం 144 సెక్షన్ అమలులో ఉందని, ఇది వచ్చే నెల 5 వరకు కొనసాగుతుందని అన్నారు. అప్పటి వరకు గ్రామాల్లో ఎటువంటి కార్యక్రమాలు


సమీక్షిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్‌దొర

జరగకుండా గ్రామ రెవెన్యూ సహాయకుల ద్వారా దండోరా వేయించాలన్నారు. ఆ సమాచారాన్ని తహశీల్దార్ కార్యాలయాలకు అందజేయాలని ఆదేశించారు. గ్రామాల్లో గూమిగూడి ప్రజలు ఉండకూదన్నారు. సభలు, సమావేశాలు పెట్టరాదన్నారు. పండల సమయంలో డిజెలు పెట్టవద్దని సూచించారు. వీధి, స్టేజ్ నాటకాలు నిషేధమన్నారు. బాణసంచాలు కాల్చరాదన్నారు. అలాగే పెట్రోల్, డీజిల్ బొటళ్లు, డ్రమ్ముల్లో, ఇతర పాత్రల్లో నిల్వ ఉంచరాదన్నారు. గ్రామాల్లో ఎటువంటి బెట్టింగ్‌లు, ఇతర ఆర్థికపరమైన ఆటలు ఆడరాదన్నారు. వీటిపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. పై అంశాలు అతిక్రమించిన వారిపై పోలీసు కేసులు నమోదు చేసి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు ఫలితాల అనంతరం బూత్ వారి పోలింగ్‌పైనా దృష్టిసారించాలన్నారు. సమావేశంలో సిఐ ఇమ్మాన్యుల్‌రాజు, టౌన్, రూరల్ ఎస్ఐలు సత్యనారాయణ, లక్ష్మణరావు, కవిటి ఎస్ఐ రాము, డిటి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.


సంతబొమ్మాళి : ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

పలువురికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- కవిటి

మండలానికి చెందిన హనుమాన్ హెల్పింగ్ హేండ్స్ స్వచ్ఛంద సంస్థ దాతృత్వాన్ని చాటుకుంది. డి.గొనపపుట్టుగ పంచాయతీ వి.జల్లుపుట్టుగకు చెందిన దాశరథి దళాయి కొన్నేళ్లుగా ఉదర సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స కోసం రూ.లక్షల్లో ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో రెక్కాడితే గాని డొక్కాడని దాశరథి కుటుంబం దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. విషయం తెలుసుకున్న హనుమాన్ హెల్పింగ్ హేండ్స్ సంస్థ సభ్యులు మంగళవారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. అధైర్యపడొద్దు అండగా ఉంటామని చెప్పి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు విజయ్, ప్రవీణ్, మోహన్, ప్రియాంక, ఇంద్ర, శైలజ తదితరులు పాల్గొన్నారు.


సంతబొమ్మాళి : సారవకోట మండలం బురుజువాడకు చెందిన గొర్లె లక్ష్మీనారాయణ చిన్న కూతురు మోక్షశ్రీ కేన్సర్‌తో బాధపడుతుంది. అనకాపల్లి జిల్లా కేంద్రంలోని అగనంపూడిలోని హోమీ బాబా కేన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న మండలంలోని బడేకుప్పన్నపేట కేంద్రంగా పనిచేస్తున్న కెపి స్పందన ఫౌండేషన్ మంగళవారం వైద్య ఖర్చుల నిమిత్తం రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో స్పందన అధ్యక్ష, ఉపాధ్యక్షులు షణ్ముఖరావు, భూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి రాజీవ్‌గాంధీ కృషి ఎనలేనిది

ప్రజాశక్తి- ఆమదాలవలస

దేశాభివృద్ధికి మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ ఎనలేని కృషి చేశారని పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు అన్నారు. పట్టణంలోనే కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 40 ఏళ్ల వయసులో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మొట్టమొదటి వ్యక్తి రాజీవ్‌గాంధీ అని కొనియాడారు. పంచాయతీలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి 72,73 రాజ్యాంగం ద్వారా నేరుగా పంచాయతీలకు నిధులు వచ్చే విధంగా కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపిపి బొడ్డేపల్లి గోవింద గోపాల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి లఖినేని నారాయణరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బస్వా షణ్ముఖరావు, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు బొడ్డేపల్లి రవికుమార్, సరుబుజ్జిలి కాంగ్రెస్ మండల అధ్యక్షులు దాలయ్య, బొడ్డేపల్లి శ్రీనివాసరావు, పూజారి త్రినాథ్, పప్పల అప్పారావు, సనపల వాసుదేవరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం : నగరంలోని ఇందిరా విజ్ఞాన భవనంలో మజీ పిఎం రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. కార్యరకమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబటి కృష్ణారావు, మంత్రి నరసింహమూర్తి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్, గార మండల అధ్యక్షుడు అంబటి దాలినాయుడు, దంత త్రినాథరావు, జి.ఎ.నాయుడు పాల్గొని రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పలాస : కాశీబుగ్గ బస్టాండ్ సెంటర్‌లోని మాజీ పిఎం రాజీవ్‌గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు, తంగుడు వీర్రాజు, డాక్టర్ రమేష్ సాహు, ఉప్పాడ రాజారావు, రత్నాల బాబూరావు, సాసుమాన లోకేష్, కర్రి ప్రసాద్, పైల శ్రీనివాసరావు పాల్గొన్నారు.